


అడ్వకేటు రంగనాయకులు గారి ఆఫీసుకు ప్రతి ఆదివారం శలవు. ఎందుకనో మరి ఈ ఆదివారం ఆయన ఆఫీసు గది తలుపులు తెరచి ఉన్నాయి. అదీ సాయంత్రం ఆరుగంటల వేళ. జూనియర్ అడ్వకేటు హరనాథబాబు ఒక కేసుకు సంబంధించిన కాగితాలు, 'కేస్‌లా'లు తిరగేస్తున్నాడు. మధ్య మధ్యలో ఏదో పెన్సిలుతో గుర్తులు పెట్టుకుంటు న్నాడు.

సరిగా అదేసమయంలో ఆ ఆఫీసు గదిపైన బాల్కనీలో నిలబడి రంగనాయకులు గారి కూతురు ప్రసూన రోడ్డు మీద పోతున్న అందమైన అబ్బా యిలకు 'మార్కులు' వేస్తోంది. ఆ అమ్మాయికి ఏమీ తోచనప్పుడు చేసే పని అదే. ఎంతసేపు చూసినా ముప్ఫై అయిదు మార్కులు దాటిన వాడెవడూ కనబడలేదు. చివరకు విసుగొచ్చింది. 'వెంకట్రావు నయినా రమ్మన్నాను కాదివాళ' అనుకుంది. ఏం చెయ్యాలా అని చెంపకు చెయ్యిజేర్చి అలా ఆకాశంలోకి చూసింది.

ప్రొద్దుటి నుంచి వినువీధిలో విచ్చలవిడిగా విహ రించిన దినకరుడు అలసిపోయి ఉన్నాడేమో జారి లోతు తెలియని లోయల్లో పడిపొయ్యాడు. ఆ అగ్ని గోళం పడ్డచోట ఆకాశమే అంటుకున్నదో భూమే తగలబడుతున్నదో పశ్చిమాన అంతటా ఎర్రని మం టలు లేస్తున్నాయి. ప్రకృతి కంతటికీ ఈ వార్త చెప్పాలని గాలి తెరలు తెరలుగా నాలుగు చెరగులకూ పరుగులు పెడుతోంది. ఆవింత చూడాలని తెల్లని మబ్బులు గుంపులు గుంపులుగా ముందుకు పోతు న్నాయి.

అప్పుడా అమ్మాయికి స్ఫురించింది టాంక్‌బండ్ మీద నిలబడితే ఆ దృశ్యాన్ని 'సినిమా స్కోప్'లో చూడొచ్చని.

రంగనాయకులుగారు చేపట్టిన ప్రతికేసుకూ, 'అప్పీలు' తప్పదుగాని, ప్రసూన తల్పెట్టుకున్న పనికి మాత్రం ఇంటా, బయటా 'అప్పీలు' లేదు. కారు తాళం చెవులు తీసుకుని, ఎత్తు మడమల జోడును టకటక లాడిస్తూ చకచక మెట్లు దిగి వరండాలోకి వచ్చింది. ఎంత వూపుగా వచ్చిందో, అంత స్థాణువులా నిలబడింది.

ఎదురుగా ఆఫీసు గదిలో హరనాథ బాబు తల వంచుకొని చదువుకుంటున్నాడు. శలవు రోజు పని చెయ్యటం, అతని మతానికి విరుద్ధం.

"వ్హాట్, ఇవాళ ఆదివారమేనా, అయితే ఇతను హరనాథ బాబేనా.." అని అనుకుంటూ టేబులు ముందుకు వెళ్లి చిన్నగా దగ్గింది. తలెత్తి ఏమి టన్నట్టు చూశాడు. అతనలా తీక్షణంగా చూస్తుంటే ఆ అమ్మాయికి ఏం మాట్లాడాలో తోచలేదు.

"ఏం చేస్తున్నారు."

"చదువుకుంటున్నాను."

"ఇవాళ ఆదివారంగా."

"అవును."

"ఇరవైనాలుగు గంటలూ ఇలా పుస్తకాల మధ్య మగ్గిపోవటానికి మీకు విసుగ్గా ఉండదూ."

"ఉండదు."

'ఓ యబ్బ, పెద్ద లాయరు. తనతో గూడా పోర్సులో మాట్లాడినట్లే.' అనుకుంది.

అపురూపంగా నిన్ను చూసుకుంటున్నాను. ఎక్కడో ఒంటి స్తంభం మేడలో నీవు కమ్మగా పాడుతుంటే తన్మయత్వంతో నీ భర్త నీముందు వాలిపోవాలి. మీరు అలా హాయిగా, ఆనందంగా ఒకరికొకరు చూసుకుని ప్రపంచాన్నే మర్చిపోవాలి. నిన్ను యదార్థంగా అలా చూసే రోజు ఎప్పుడొస్తుందాని తహతహలాడి పోతున్నాను. నేను ఎంత పట్టుదల గల మనిషినో నీకు తెల్సుగా. ఎప్పటికైనా సరే నీకు ఆ స్థితిలో ఉన్న సంబంధం తెస్తాను.. అంతేకాని నువ్వు ఈ వెధవలతో ఊళ్ళూ తిరుగుతూ, పాటలు పాడుతూ, నాటకాలు వేస్తూ.. ప్చ్.. ఊహూ, నిన్ను అలా ఊహించుకోవటానికే నా మనసొప్పుకోవటంలేదు.'' చెల్లెల్ని దగ్గరకు తీసుకుని ఆప్యాయంగా తల నిమురుతూ ఉండి పోయ్యాడు. అనూరాధకు ఏదో అసంతృప్తిగా ఉంది గాని, ఏమీ మాట్లాడలేకపోయింది.

రంగనాయకులుగారి దగ్గర పదేళ్ళ నుంచి గుమాస్తాగా పని చేస్తున్నాడు వెంకట్రావు. కావటానికి గుమాస్తాయే అయినా వెంకట్రావుకు రంగనాయకులు గారింట్లో ఉన్న స్థానం వేరు. సావిత్రమ్మగారికి గాని, ప్రసూనకు గాని ఓ సలహా కావల్సి వచ్చినా, సహాయం కావల్సి వచ్చినా వెంకట్రావుని అడగకుండా ఉండలేరు. అలాంటి అవకాశాల్ని ఎంత తెలివిగా విని యోగించుకోవచ్చో, ఎవరైనా వెంకట్రావు దగ్గర నేర్చుకోవచ్చు.

హరనాథబాబు జూనియర్‌గా చేరాక, ఆఫీసు పని గూడా పెరిగింది. పార్టీలు ఎప్పుడు రావల్సిందీ, ఎప్పుడు పోవల్సిందీ, ఏ కాగితానికి ఎంత పనూలు చెయ్యాల్సింది అతనే చూసుకునేవాడు. ఒకమాట చెప్పినా, ఒక పని చెప్పినా దాని వెనకాల వెంకట్రావు

# “ ? ”

ప్రభావం ఏదో ఉంటూనే ఉంటుంది. పార్టీల ద్వారా ఈ సంగతి తెల్సినప్పుడు హరనాథబాబు ఒకటిరెండు సార్లు మందలించాడుగాని, అతనికి చీమ కుట్టినట్లుగా గూడా లేదు.

ఇంతవరకెన్నడూ లేనిది రంగనాయకులుగారు హరనాథబాబును, అనూరాధను పండగకి తమ ఇంటికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఆఫీసు గదిదాటి రంగనాయకులుగారింట్లోకి ప్రవేశించటం హరనాథబాబుకు అదే ప్రథమం. తోటి న్యాయవాది, వీరిద్దరికీ మిక్కిలి ఉభయులకు సన్నిహితుడూ అయిన నారాయణరావు గారు గూడా ఆ పూట రంగనాయకులుగారి అతిథిగా వచ్చారు.

విందు అయిన తర్వాత తాంబూలాలు నములుతూ పిచ్చాపాటీ మొదలుపెట్టారు. కాసేపటికి నారాయణ రావు గారు సంభాషణను పెళ్ళిళ్ళ మీదకు తిప్పారు. చివరకు అసలు విషయం కాస్త బయట పడేసారు.

“చూడు హరనాథబాబూ, రంగనాయకులి గారి కుటుంబాన్ని గురించి నేను నీకేమీ చెప్పనవసరంలేదు. ఒక్కగా నొక్క పిల్ల. ఈ భవంతి, స్వగ్రామంలోని పొలం వారి తదనంతరం అంతా అమ్మాయికి చెందేదే. ఇహ అమ్మాయంటావా, రోజూ నీ కళ్ళముందు తిరుగుతూనే ఉంది..'' అని ఫెళ్ళున నవ్వేశారు.

పక్కగదిలో సావిత్రమ్మ, ప్రసూన, అనూరాధ మౌనంగా వింటున్నారు. హరనాథబాబు విని మౌనంగా ఉన్నాడు.

“ఊ.. ఏమంటావు మరి.”

“ఇప్పుడు నా పెళ్ళికేం తొందరొచ్చిందండీ.” అంతకన్నా ఏమనాలో ఆ నిముషంలో తోచలేదు.

“ఏ వయసులో జరగవల్సిన ముచ్చట ఆ వయసులో జరగాలయ్యా, మీ పెద్దవాళ్ళకి అదృష్టం లేకపోయిందిగాని, ఉంటే ఇన్నాళ్ళూరుకునే వాళ్ళా...' ఏమీ అనుకోకు. తెలియక అడుగుతున్నాను. నీకు ముఖ్యమైన వాళ్ళెవరైనా ఉన్నారా?''

‘‘ఉండటానికి ఉన్నారు. రేణుకా ఫిలింస్ అనే పేరుతో సినిమాలు తీస్తున్న సుందరామయ్యగారు మా మేనమామే.'

నారాయణరావు అందుకున్నారు ‘‘అవును సుందరామయ్య గారంటే పెద్దపేరు. నేను మద్రాసు వెళ్ళినప్పుడు స్టూడియో చూద్దామని వెళ్ళాను. ఆయన అక్కడే ఉన్నారు. అంత పేరూ ప్రఖ్యాతి గడించినా గూడా మనిషికి గర్వం లేదయ్యా. మహానుభావుడు..”

ఆ స్తోత్రం అలా సాగిపొయ్యేదేగాని హరనాథ బాబు అడ్డుపడ్డాడు. ‘‘కాని ఆయనంటే నాకు పడదు. నా సంగతి మీకు తెల్సుగా. ఆయన పద్ధతులు, వేషాలు నాకు నచ్చవు. నా ఊహ తెల్సినప్పటి నుంచి ఆ గుమ్మం తొక్కలేదు.''

నారాయణరావుగారు తన పొరపాటు తెల్సుకున్నారు. ‘ఆ, ఏం మనిషి లెద్దురూ. నేను ఆ కాసేపట్లోనే కనిపెట్టేశాను. ఉండవల్సిన అవలక్షణాలన్నీ ఉన్నాయి. సినిమాల్లోకి దిగాక ఏముంది? ఒక తాగుడేనా, ముండలేనా... అదీ ఒక బ్రతుకేనా? పోని వ్వండి మనకెందుకు. అయినా మేమంతా నీ వాళ్ళం కాదుటయ్యా? నువు ‘ఊ’ అను.''

“నన్ను ఆలోచించుకో నివ్వండి.”

“మహారాజుగా, నువ్వు, అమ్మాయి ఆలోచించుకుని ఒక నిర్ణయానికి రండి. వీలైనంత తొందర్లో లగ్నం పెట్టించేద్దాం. ఆ కాస్త అడ్డూ తీరిపోయిందంటే అంతా కల్సి ఇక్కడే ఉండొచ్చు...”


ఆరాత్రి హరనాథబాబు ఆలోచించాడు. మామయ్య లక్షల మీద వ్యాపారం చెయ్యవచ్చు. ఆయన కూతురు రేణుక అందాల భరిణ కావచ్చు. ఆ గారాలపట్టిని తనకు కట్టబెట్టాలని ఆయనకుంటే ఉండనూ వచ్చు. ఎన్ని ఉంటే ఏం లాభం? మామయ్యకు లేని వ్యసనాలు లేవు. ఈ జన్మకు తను ఆయన్ని మన్నించ లేడు.

ప్రసూనకు అందం ఉంది. ఆస్తి ఉంది. దాని వెనకాల తలవంచుకోవల్సిన చరిత్ర ఏదీలేదు. తనకీ మనువు చాలు. మామయ్య ముఖాన కొట్టినట్లు ఉండటానికి ఈ అవకాశం చాలు.

హరనాథబాబు ‘సరే’ నన్నాక మిగిలిన పనులన్నీ చకచక జరిగిపోయినయి. సంటితిరిగి వచ్చేటప్పటికల్లా రంగనాయకులు గారింట్లో మేళాలు మ్రోగినయి. నగరంలోని పెద్దలంతా షామియానాలోని సోఫాల్లో కూర్చుని కూల్‌డ్రింకులు తాగుతూ హరనాథబాబును ఆకాశానికెత్తేశారు.

సరిగా లగ్నం వేళకు సుందరామయ్యగారు సకుటుంబంగా దిగనే దిగారు. అనూరాధ ఎదురు వెళ్ళి ఆప్యాయంగా ఆహ్వానించిందిగాని, హరనాథబాబుకు ఆ తీరిక లేకపోయింది. లగ్నం అయిన తర్వాత గూడా నలుగురు హైకోర్టు జడ్జీలతో మాట్లాడుతూ ఉండిపొయ్యాడు.

పెళ్ళంతా పూర్తయ్యేలోపల బంధువుల బల



కంఠం మీద అనూరాధ రెండు పాటలు పాడింది. ఆ రెండు పాటలతో అక్కడి వారంతటి ప్రశంసలు పొందింది.

వచ్చినప్పటినుంచి అప్పుటికు తిరుగుతున్న హరనాథ బాబును సాయంత్రం విడిచింది రేణుక.

"ఏం బావా, పలకరించను గూడా లేదు. మీ అనిల్లి మానుకుని గర్వమా!"

ఆమాట అన్నాక లాంఛనంగా మేనమామ పక్కన కూర్చుని వాలికాట ప్రశ్నలు వేశాడు. ఆయన న్యాయ శాస్త్రాన్ని కుతుపుతూ వచ్చారు.

ఆ పూటనే మంత్రరామయ్యగారు వెళ్ళమని బయల్దేరితే, బయట దాకా వచ్చి సాగనంపాడు హరనాథబాబు.

మరో పదిరోజులు గడిచాక ఒకరోజు హైకోర్టులో పని ముగించుకుని బయల్దేరుతుండగా జడ్జి రామ్మూర్తిగారు హరనాథబాబు కోసం కబురు పెట్టారు. కారులో ఆయన ఇంటికి తీసుకు వెళ్ళారు.

# " ? "

రెండుమూడు ఎకరాల విస్తీర్ణంగల తోట, మధ్యలో విశాలమైన మేడ ఉంది. ఇద్దరు పని మనుష్యులు తప్ప తోటలోగాని, మేడలోగాని మనుష్యులు ఉన్న అలికిడే లేదు.

తేనీరు తాగాక, సిగరెట్టు వెలిగించి రామ్మూర్తిగారు చెప్పారు. "మొన్న మారేజిలో మీ సిస్టర్ని చూశాను. ఆ అమ్మాయి పందిట్లో కళకళలాడుతూ తిరుగుతుంటే నాకెంతో ముచ్చటేసింది. రెండు పాటలు గూడా పాడింది. ఆ పాటలు ఇంకా నాచెవులక్కి వినిపిస్తూనే ఉన్నాయి. ఈ ఇల్లు చూశావుగా. మ్యూజియంలో ఉంది. ఎన్ని ఉన్నా, ఈ ఇల్లు పాడుబడ్డ ఇల్లులా అనిపిస్తుంది. ఒక్కోసారి ఈ నిశ్శబ్దాన్ని భరించలేననిపిస్తుంది."

ముందుకు వంగి సిగరెట్ నుసి 'ట్రే'లో విదుపుతూ రెండుక్షణాలు ఆగి మళ్ళీ మొదలెట్టారు.

"మొన్న మీ చెల్లెల్ని చూసినప్పటి నుంచి నాకళ్ళ ముందు ఆ అమ్మాయే మెదులుతోంది. ఆమె ఈ ఇంట్లో మసులుతున్నట్లు, మేడ మీద గదిలో వీణ వాయిస్తున్నట్లు పదేపదే అన్పిస్తుంది. ఎందుకో నా మనసలా పరుగెడుతోంది. ఆవూహాలు అలా సాగుతున్నాయి."

రామ్మూర్తిగారు లేచి పక్కగదిలోకి వెళ్ళారు. హరనాథబాబు మనసులో వ్యక్తావ్యక్తమైన భావాలేవో ఉత్తుంగ తరంగాల్లా లేచి పడుతున్నాయి. అనూరాధ మీద ఆయనకు అలాంటి ఊహాలు రావటం, వచ్చినా అంతటితో సరిపెట్టుకోక తనను పిల్చి నిర్భయంగా చెప్పటం అతనికి నమ్మతగ్గదిగా కనబడ లేదు. రామ్మూర్తిగారి రూపం ఎన్నడూ చూడని కర్కశత్వంతో అతని కళ్ళ ముందు కదిలింది. ఆయన మీద ఉన్న గౌరవం పునాదులతో సహా చలించసాగింది.

రామ్మూర్తిగారు ఒక ఫోటో తెచ్చి చేతికిచ్చారు. ఆ ఫోటోలో అతను దొరబాబులా ఉన్నాడు. పాతికేళ్ళు ఉంటాయి అనిపించినా, ముఖంలో లేతదనం పోలేదు.

"మావాడు. రిసెర్చి చేస్తున్నాడు. వారంరోజుల్లో సెలవులకి ఇంటికి వస్తాడు. వాడు గుమ్మంలో కారు దిగేటప్పటికి, ఈ సారి అమ్మాయి స్వాగతం చెప్పాలి. మేడ మీదకు తీసుకుపోయి, వాడికి కావల్సిన ఏర్పాట్లన్నీ అమ్మాయే చూస్తూ, వాడి జీవితానికీ, ఈ ఇంటికి ఓ నిండుదనం తీసుకురావాలి. ఈ పదిరోజుల నుంచి నాకిలాంటి ఆలోచనలే వస్తున్నాయి. మీ ఉద్దేశ్యం కనుక్కుందామనే పిలిపించాను."

హరనాథబాబుకు కృతజ్ఞత ఎలా చెప్పాలో తెలియక తికమక పడ్డాడు. ఫోటోను ఆయనకిస్తూ రెండుచేతులూ పట్టుకున్నాడు.

"ఇది మా అదృష్టం. ఇది మీ ఔదార్యం." అంటూ మాటలు దొరక్క తడబడ్డాడు అడ్వకేటు హరనాథ బాబు.

అనూరాధ జడ్జి రామ్మూర్తిగారి కోడలు!

కలగనటానికి గూడా అర్హతలేని సంగతి కళ్ళ ముందు జరగబోతోంది. ఆయన దగ్గర శలవు తీసుకుని బయటపడ్డాక, అతనికేదో గొప్ప విజయం సాధించినట్లు, అదంతా లోకానికి చాటాలన్నట్లు, అందుకు గాలిలో ఎగిరిపోవాలన్నట్లు అనిపించింది.

టాక్సీలో కూర్చుని రంగనాయకులుగారి ఇంటి అడ్రసు చెప్పాడు. రంగనాయకులు గారికి, సావిత్రమ్మ గారికి, ప్రమోనకి చెప్పాలి. చెప్తే నమ్మతారా? నమ్మతారుగాని, తెరిచిన నోరు మూసుకోవటం మర్చిపోతారు. అనూరాధంటే ఏమనుకున్నారు మరి. అది తన చెల్లెలు.


ఇంతటి వార్త దాని చెవిని పడెయ్యకుండానా పోవటం అనుకుని టాక్సీని చిక్కడపల్లి పోనివ్వమని చెప్పాడు.

చిక్కడపల్లి మెయిన్‌రోడ్డు మీదకు వచ్చాక టాక్సీవాడు అడిగాడు.

"ఎటు పోవాలి సార్."

"ఎడమ వైపు, ఆ రెండో ఇంటి ముందు ఆపు."

గేటు తీసుకుని పెద్దపెద్ద అంగలతో లోపలికి వెళ్ళాడు. తాళంవేసి ఉంది. 'అనూరాధ గూడా



అక్కడే ఉందన్నమాట. తిన్నగా అటే వెళ్తే బావుం డేది' అనుకుంటూ వెనుదిరిగాడు. పక్కవాటా లోవి వాళ్ల పిల్లవాడు 'అక్కయ్య ఇమ్మంది' అంటూ తాళం చెవి, కవరు అందించాడు. జేబులో కుక్కుకుని వచ్చి టాక్సీలో కూర్చున్నాడు.

పెద్ద బరువు దించుకున్నట్లుగా వెనక్కివాలి విట్టూర్చాడు. పెళ్లి సంగతి విని సిగ్గుపడుతుంది అనూరాధ. గర్వంగా నవ్వుకున్నాడు.

ముహం తుడుచుకోవటానికి జేబుగుడ్డ కోసం తడుముకున్నాడు. కవరు తగిలింది. ఇందాక ఆ కుఱ్ఱ వాడు ఇచ్చాడు. 'ఏమిటిది' అనుకుంటూ తెరిచాడు.

"అన్నయ్యా, నువు నన్ను క్షమించవని తెల్సు. అయినా భవిష్యత్తు మీద అపారమైన నమ్మకం పెట్టుకుని వెళ్తున్నాను. మామయ్య తర్వాత పిక్చర్లో చాన్సు ఇస్తాను రమ్మన్నాడు. ముందుముందు నేనేమైపోతానో నన్న భయంలేదు. కానీ నీ నమ్మకాన్ని వమ్ముచేసి, మన అనుబంధాన్ని తెంచుకుని పోతున్నా నన్న బెంగ మాత్రం నన్ను క్రుంగదీస్తోంది. ఎప్పుడైనా నా మీద మనసుపోతే మామయ్య పేర ఒకకార్డు వ్రాయి—అనూరాధ."

ఛర్రున ఆ కాగితాన్ని ముక్కలు ముక్కలుగా చించి గాల్లోకి విసిరేశాడు. తీరిపోయింది. దానికీ తనకూ ఋణం తీరిపోయింది. పాటలు పాడి, వేషాలు వేసి అడ్డమైన వెధవలతో తిరిగే అల్పురాలు తన చెల్లెలెలా అవుతుంది? పతనానికి సిద్ధపడి మొదటి మెట్టుజారింది. ఎక్కడపడిపోతుందో ఎవరికితెల్సు?

పుట్టినప్పటి నుంచి ఒక్కరోజు గూడా దాన్ని విడిచి ఉండలేదు. అది కనపడకపోతే తనెంతగా విల విల్లాడిపోతాడో తెల్సు. తెల్సి, లెక్క చెయ్యకుండా వెళ్లిపోయింది.

'అనూరాధ ఇకలేదు. చచ్చిపోయింది' తల్చుకున్న కొద్దీ కోపం కన్నా ఎక్కువగా దుఃఖం రాసాగింది. కళ్లలో గిర్రున నీళ్లు తిరిగినయి. జేబు గుడ్డతో ముహాన్ని తుడుచుకుని, కళ్ళు అద్దుకున్నాడు.

టాక్సీ ఆగింది. డబ్బులు ఇవ్వకుండానే లోపలికి పరుగెత్తాడు. రెండేసి మెట్లు ఒకసారి గెంతుతూ, మేడ మీదకు చేరాడు. వ్రసూన గది తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి. లోపల వ్రసూన ఎవరితోనో అంటున్నది.

"అప్పుడేదో ఉద్రేకంలో తప్పు చేశాం. నిజానికి అప్పుడది తప్పని గూడా అనిపించలేదు. ఏదో సాహసం చేస్తున్నాం అనిపించింది. కానీ ఇప్పుడు దాన్ని తల్చుకోవటానికే భయంగా ఉంది"

"ఈ పదిరోజుల్లో పతివ్రతవై పోయావన్న మాట." అది వెంకట్రావు గొంతు.

"ఏమైనా అను. కానీ ఈ సంగతి ఆయనకు తెలియనివ్వకు, వెంకట్రావు, ప్లీజ్."

అనాలోచితంగా తలుపు సందులో నుంచి చూసి. ఆ దృశ్యం కలిగించిన 'షాక్'కు కొయ్యబారిపొయ్యాడు. చివరకు ఇలాంటి కూపంలోనా పడ్డాడు తను?

మంచీ, చెడూ చెరొక వైపున చేరి, మందరగిరి పర్వతాన్ని కవ్వంగా చేసి అతని మస్తిష్కాన్ని మధించ సాగినయి. ఆ ఉద్వేగానికి తట్టుకోలేక, తప్పటడుగులు వేస్తున్న పిల్లాడిలా, తేలిపోతున్న కాళ్లను నేల మీద ఈడ్చుకుంటూ, మెట్లు దిగి వెళ్లిపోయి వాడు.

అనూరాధ, హరినాథబాబు అంత హఠాత్తుగా ఎందుకు అదృశ్యమైపోయినారో, ఎవరికీ అర్థం కాలేదు. ●




## పుష్పము మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన చర్యను గురించిన్నీ మీరు తెలుసు కొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన మీకిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయులేదీ, వేళవివరములున్నూ, మీసరియైన చిరునామా, వెంటనే వ్రాసిపంపండి. జ్యోతిషశాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసినతేదీ లగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, వ్యవహారములో విజయము కలుగునో, ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ పయనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాత్ ద్రవ్య లాభము మొదలగువానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1.25పై.లకు మాత్రము వి. పి. గా పంపగలము. వి. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్టగ్రహములేవైనా ఉన్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మాపూచీపై పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిలేనియెడల పైకము వాపసుచేయబడును. ఒకసారిపరీక్షించండి. అడ్రసు ఇంగ్లీషులో వ్రాయుడి

PT. DEV DUTT SHASTRI, RAJ JYOTISHI,
(A. W. P.) Post Box No. 86, JULLUNDUR CITY.



ఇప్పటి నుంచి శుభ్రత పరిశుభ్రకరమైన, ఆరోగ్యకరమైన స్నానానికి—వాడండి.

# కొత్త పెద్దది, ఎఱ్ఱనిది నహాన్

క్రెసిల్‌తోగూడినది

ఇప్పటి నుంచి మీరు కొత్త పెద్దది, ఎఱ్ఱనిది, నహాన్‌తో ఆనందంగా రోజూ స్నానం చెయ్యండి. ఈ పెద్దది, ఎఱ్ఱని స్నానపు సబ్బులో, మీకు అన్ని విధములైన పరిశుభ్రకరమైన, ఆరోగ్యకరమైన స్నానమును సమకూర్చే క్రెసిల్ వున్నది! రోజూ నహాన్‌తో స్నానం చెయ్యండి: అది ఆరోగ్యకరమైన అలవాటు. మరిగుర్తుంచుకోండి: నహాన్ పెద్దది—చాలా ఎక్కువ ఆరోగ్యకరమైన స్నానములకు వనికివచ్చును.




ఒక టాటా ఉత్పత్తి

CMTN-IA-78